క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: విద్యుత్ సబ్‌స్టేషన్లలో నిర్వహణ పనులు చేస్తున్నందున ఈనెల 17న వరంగల్ వ్యాప్తంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ఆజంజాహి మిల్స్, వరంగల్ స్టేషన్‌రోడ్డు, ఖిలా వరంగల్ రోడ్డు, గొర్రెకుంట, ఉర్సు, శంభునిపేట, మామునూరు, బొల్లికుంట, పోతన, కేఎంసీ, పోచమ్మమైదాన్, ఏనుమాముల, ఆరెపల్లి, దేశాయిపేట సబ్‌స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 8గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బాక్సింగ్ క్రీడాకారిణికి అభినందన



హసన్‌పర్తి / వరంగల్ స్పోర్ట్స్: జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు హసన్‌పర్తి మండల కేంద్రానికి చెందిన శీలం తనుశ్రీ ఎంపికైంది. ఈనెల 18నుంచి 26వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్‌లో జరగనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు కోచ్ శ్యాంసుందర్ తెలిపారు. ఈ సందర్భంగా తనుశ్రీని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు, తదితరులు శనివారం అభినందించారు. జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ స్వామి చరణ్, సీనియర్ బాక్సర్లు ప్రేమ్‌సాగర్, శశికాంత్, పార్థసారథి, క్రాంతి, కార్తీక్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ

వరంగల్: వరంగల్ కాశిబుగ్గ, ఎల్‌బీ.నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయ టాలెంట్ సెర్చ్ ఒలింపియాడ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి లెవల్ -1, లెవల్ -2లో ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ రాజశ్రీ తెలిపారు. ఈపరీక్షలో తమ పాఠశాలల విద్యార్థులు స్పెషల్ ప్రైజ్‌లు 2, కన్సోలేషన్ ప్రైజ్‌లు 81, గోల్డ్ మెడల్స్ 147, మెరిట్ సర్టిఫికెట్లు 235 మంది సాధించగా, 6వ తరగతి విద్యార్థి సాయి భరద్వాజ్ లాప్‌టాప్ గెలుచుకున్నాడని అన్నారు. బహుమతులు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ రంజిత్, సి బ్యాచ్ ఇన్‌చార్జ్ జనార్దన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ ఒలింపియాడ్‌కు వేదచరణ్



కాజీపేట రూరల్: ముంబాయిలోని ప్రతిష్టాత్మక హెచ్‌బీసీఎస్ఈ సంస్థ నిర్వహించిన ఐఎంఓటీసీ (ఇంటర్నేషనల్ మ్యాథమెటిక్స్ ఒలింపియాడ్ ట్రైనింగ్ క్యాంప్)కు దేశంలో 45 మంది విద్యార్థులు ఎంపిక కాగా, అందులో తమ పాఠశాల నుంచి వేదచరణ్ రెడ్డి ఎంపికయ్యారని ఐఐటీ అకడమీ డైరెక్టర్ రాజేంద్రకుమార్ తెలిపారు. ఒలింపియాడ్‌కు అవసరమైన శిక్షణను కాజీపేటలోని నాగేశ్వరరావు ఐఐటీ అకాడమిలో ఆన్‌లైన్‌లో ఇచ్చినట్లు తెలిపారు. ఆ విద్యార్థిని పలువురు అభినందించారు.

పొట్టి శ్రీరాములుకు నివాళి



హసన్‌పర్తి: ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు జయంతిని హసన్‌పర్తిలోని జిల్లా పరిషత్ పాఠశాలలో శనివారం నిర్వహించారు. హసన్‌పర్తి వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. క్లబ్ అధ్యక్షుడు శ్యాంసుందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమాదేవి, క్లబ్ కోశాధికారి నాగమల్ల మాధవ్, క్లబ్ మాజీ అధ్యక్షులు నాగమల్ల సుధీర్, గొరిశెట్టి కృష్ణమూర్తి, సతీష్, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు ప్రారంభం

హసన్‌పర్తి: సీతంపేట - బాహుపేట, పెంబర్తి - అంబాల మధ్య సీసీ నిర్మాణ రోడ్డు పనులు శనివారం ప్రారంభమయ్యాయి. ఈమేరకు రోడ్డు పక్కన ఉన్న చెట్లను తొలగించారు. సుమారు రూ.1.75 కోట్ల వ్యయంతో రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నారు.

టీజీ పేరుతో వాహన రిజిస్ట్రేషన్లు

ఖిలా వరంగల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో వాహన రిజిస్ట్రేషన్లు టీఎస్ నుంచి టీజీగా మార్పు చెందిన విషయం తెలిసిందే. ఈక్రమంలో వరంగల్ రవాణాశాఖలో టీజీ 24 సిరీస్ ప్రారంభం కావడంతో వాహన రిజిస్ట్రేషన్లు శనివారం జోరందుకున్నాయి. అధిక మొత్తం చెల్లించి వాహనదారులు ఫ్యాన్సీ నంబర్లను ఎంచుకున్నారు.

డ్రెయినేజీలో పసికందు శవం

వరంగల్ క్రైం: సుబేదారి పోలీస్ స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డు సహకార నగర్‌లో మురుగునీటి కాల్వలో శనివారం ఉదయం గుర్తుతెలియని పసికందు శవం లభించినట్లు ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి తెలిపారు. మున్సిపాలిటీ జవాన్ జుబేదాబేగం విధి నిర్వహణలో చెత్త ఎత్తుతున్న క్రమంలో కాల్వలో మృతి చెంది ఉన్న మగపిల్లాడి శవం ఆమెకు కనిపించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

బ్రహ్మోత్సవాలకు వెంకన్న ఆలయం ముస్తాబు

- కాజీపేటలో నేటినుంచి ఆరురోజుల పాటు ఉత్సవాలు
- భక్తుల సౌకర్యార్థం భారీ ఏర్పాట్లు



చైతన్యపురి కాలనీ స్వాగత తోరణం



దేవాలయ పరిసర ప్రాంతాలు



ఆలయంలోని దేవతామూర్తులు

కాజీపేట: కాజీపేట చైతన్యపురి కాలనీలోని పద్మావతి, గోదా సమేత వేంకటేశ్వర స్వామి ఆలయం 22వ బ్రహ్మోత్సవ వేడుకలకు అందంగా ముస్తాబైంది. ఆదివారం నుంచి 22వ తేదీ వరకు వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఉత్సవాలు జరగనున్నాయి. నగరం నలుమూలల నుంచి వెంకన్న ఉత్సవాలకు భక్తులు హాజరవుతారు.

ఉత్సవాలకు ఏర్పాట్లు

వార్షిక బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం ఆలయంలో తగిన ఏర్పాట్లు చేయడంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తీరిక లేకుండా శ్రమిస్తున్నారు. నిట్ ఎదురుగా ఉన్న చైతన్యపురి కాలనీలో పేదల తిరుపతిగా పిలువబడే ఈ ఆలయంలో భక్తులు నిత్యం విశేష పూజలు నిర్వహిస్తుంటారు. ఆలయంలో కుంకుమ పూజలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, అన్నమాచార్య సంగీత కచేరీలు వంటివి నిర్వహించడం ఈ ఆలయం ప్రత్యేకత. ఆలయం ముందు భాగంలోని స్వాగత తోరణం చైతన్యపురి కాలనీకే ప్రత్యేక శోభగా నిలిచింది. ఆలయం వద్ద వసతులు, మండపం, ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణలో పచ్చని మొక్కలు, పూలు, గార్డెన్, ఫౌంటెన్లు కనువిందు చేస్తున్నాయి.

బ్రహ్మోత్సవాల వివరాలు

ఈనెల 17నుంచి 22వ తేదీ వరకు కొనసాగే బ్రహ్మోత్సవాల వివరాల ఆహ్వాన పత్రికలను ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పంజాల అశోక్ కుమార్ గౌడ్, కెప్టెన్ వడ్డేపల్లి నరేందర్‌తో పాటు సభ్యులు విడుదల చేశారు. శ్రీమాన్ నల్లాన్ చక్రవర్తుల రఘునాథచార్యుల ఆధ్వర్యంలో ఉత్సవాలు జరగనున్నాయి. 17న స్వస్తి వాచనం, విష్వక్సేనారాధన, రక్షబంధనం, అంకురార్పణ, 18న ధ్వజారోహణం, దేవత ఆహ్వానం, లక్ష్మి అర్చన, 19న పూలంగిసేవ, అలివేలి మంగమ్మ వేంకటేశ్వర స్వామి కల్యాణం, 20న హోమం, గరుడసేవ, 21న సహస్ర నామర్చనలు, డోలోత్సవం, 22న పూర్ణాహుతి, శ్రీచక్రస్నానం, ముగింపు ఉత్సవాలు ఉంటాయని ఆలయ పూజారి రఘురామాచార్యులు వివరించారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి



మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలని ఏఆర్ఓ అశ్విని తానాజీ వాకడే అధికారులను ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ) అవగాహనపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు, తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలిచ్చారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, సీఎంహెచ్ఓ రాజేశ్, వరంగల్ తహసీల్దార్ ఇక్బాల్, డీఎఫ్ఓ శంకర్ లింగం, డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ ద్వారా నగరవాసులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమష్టిగా పని చేయాలని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయంలో పారిశుద్ధ్యం, ఇంజనీరింగ్, మంచి నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక తదితర విభాగాల ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్ఓ రాజేశ్, డిప్యూటీ కమిషనర్ రవీందర్, ఈఈలు శ్రీనివాస్, సంజయ్‌కుమార్, డీసీపీ ప్రకాశ్‌రెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధి శివనగర్‌కు చెందిన 20 ఏళ్ల యువతి రక్షిత శనివారం అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కథనం ప్రకారం వరంగల్ శివనగర్‌కు చెందిన ఓరుగంటి శ్రీనివాస్ ఆటో నడిపించేందుకు, అతని భార్య కూలిపనికి వెళ్లారు. ఈక్రమంలో ఆ దంపతుల కుమార్తె రక్షిత మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దాంతో తండ్రి శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

పుల్లయ్య కుంటకు చెందిన 19 ఏళ్ల యువతి..

స్టేషన్‌పరిధిలోని పుల్లయ్యకుంటకు చెందిన ఓ యువతి శుక్రవారం మధ్నాహ్నం అదృశ్యమైంది. ఇన్‌స్పెక్టర్ మల్లయ్య కథనం ప్రకారం వరంగల్ ఆర్టీఏ కార్యాలయ సమీప కాలనీ పుల్లయ్యకుంటకు చెందిన 19ఏళ్ల అలేఖ్య ఇంటర్ మీడియట్ సెకండ్ ఇయర్ పూర్తి చేసింది. పరీక్షలు రాసి 14న ఇంటికి చేరింది. శుక్రవారం మధ్యాహ్నం కూరగాయలు తెస్తానని ఇంట్లో చెప్పి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. ఆచూకీ లభించకపోవడంతో ఆమె అక్క కంజర్ల అఖిల ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొత్త పనులకు బ్రేక్

వరంగల్ అర్బన్: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో కొత్తగా అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు ఉండవని, ప్రారంభమైన పనులు మాత్రమే కొనసాగుతాయని బల్దియా అధికారులు తెలిపారు. కొత్తగా టెండర్లు, అగ్రిమెంట్లు, శంకుస్థాపనల పనులు ఉండవని, కారుణ్య నియామకాలు, పదోన్నతులు కూడా ఆగినట్లేనన్నారు. 2024-25 బల్దియా బడ్జెట్ పాలకవర్గం ఆమోదించలేదు. కేవలం అంచనాలు మాత్రమే సిద్ధమయ్యాయి. పాలకవర్గంలో నెలకొన్న అసంతృప్తులు, పార్టీ ఫిరాయింపుల కారణంగా బడ్జెట్ సమావేశం జరగలేదు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినందున కలెక్టర్ బడ్జెట్ అంచనాలను ఆమోదించి, ప్రభుత్వానికి నివేదిస్తారు. దీంతో బడ్జెట్ ప్రక్రియ పూర్తవుతోంది. పాలకవర్గ సభ్యులు, పెద్దలు బడ్జెట్ విషయంలో వీరి పాత్ర నిమిత్త మాత్రమే.

ప్రజాపాలన దరఖాస్తుల ఎడిట్ కొనసాగింపు

ప్రభుత్వం తాజాగా ప్రజాపాలన దరఖాస్తులకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చింది. దీంతో నగర వ్యాప్తంగా బల్దియా ఈ-సేవ కేంద్రాల వద్ద దరఖాస్తులను ఎడిట్ చేస్తున్నారు. ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఎడిట్ కోసం బారులుదీరుతున్నారు. ప్రజాపాలన దరఖాస్తుల ఎడిట్ కొనసాగుతుందని బల్దియా అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్ తెలిపారు. కోడ్ అమలుకు ముందు నుంచే ఎడిట్ జరుగుతుందని తెలిపారు. ఈవిషయంలో ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తామన్నారు.

దాడి కేసులో ఇద్దరిపై కేసు

ఖిలా వరంగల్: మద్యం మత్తులో ఉన్న ముగ్గరిపై దాడి చేసిన కేసులో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఖిలా వరంగల్ మండలం జక్కలొద్ది గుడిసెవాసుల కాలనీకి చెందిన రామంచ శ్రవణ్, మైదం అజయ్, మైదం ప్రశాంత్ మద్యం తాగేందుకు గవిచర్ల క్రాస్ రోడ్డులోని బార్‌కు వెళ్లారు. మద్యం తాగి బయటకు వస్తున్న క్రమంలో ఆ ముగ్గురిపై పుప్పాల గుట్టకు చెందిన లడ్డు, రామ సందీప్ దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు శనివారం రాత్రి లడ్డు, సందీప్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

వైభవంగా మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న భక్తులు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లో శివపార్వతి సమేత భక్త మార్కండేయ, గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, అభయాంజనేయ, నవగ్రహ సహిత ధ్వజస్తంభ శిఖర ప్రతిష్ఠాపన మహోత్సవం శనివారం ఉదయం వైభవంగా జరిగింది. విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవ కమిటీ, పద్మశాలి పరస్పర సహాయ సహకార పరపతి సంఘం, పద్మశాలి భవన సమితి అధ్యక్షుడు ఒడ్నాల మల్లయ్య, కన్వీనర్ ఒడ్నాల సదానందం ఆధ్వర్యంలో వేద పండితుడు వెలిదే నరసింహమూర్తి బృందం నేతృత్వంలో మంత్రోచ్చరణల మధ్య వేడుకలను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం విగ్రహాలకు ప్రాణప్రతిష్ఠ కుంభం, దృష్టిస్థాపన, గోదర్శనం, జయాదయ పూర్ణాహుతి నయనందకారంగా జరిగాయి. నగర మేయర్ గుండు సుధారాణి, గుండు ప్రభాకర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే నరేందర్ హాజరై స్వామివార్లను దర్శించుకున్నారు. కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, భాస్కర్, పాశికంటి రాజేంద్రప్రసాద్, రాజేశ్వర్‌రావు, రవి, సారంగపాణి, చంద్రమౌళి, మధు, భాస్కర్, శ్రీరాంరాజేష్, మంచాల కృష్ణమూర్తి, నవీన్, బత్తుల సత్యం పాల్గొన్నారు.

తల్లి గర్భంలో ముగ్గురు శిశువులు



ఎంజీఎం: ఓ తల్లిగర్భంలో ముగ్గురు శిశువులు ఒకే అమ్నిమాటిక్ పొరతో కప్పబడి ఉండగా ఆధునిక పద్ధతిలో శస్త్రచికిత్స చేసి ఒక శిశువును తొలగించినట్లు డాక్టర్ శిరీష తెలిపారు. ములుగు రోడ్డులో తన ఆస్పత్రిలో ఈ చికిత్సను శనివారం విజయవంతంగా నిర్వహించినట్లు పీటల్ మెడిసిన్ వైద్యురాలు డాక్టర్ శిరీష పేర్కొన్నారు. వరంగల్ శివనగర్ ప్రాంతానికి చెందిన 15వారాల గర్భవతి గుగులోతు సంతోష.. వైద్య పరీక్షల నిమిత్తం తమ వద్దకు వచ్చినట్లు తెలిపారు. ఆమె గర్భంలో ఒకే పొరలో ముగ్గురు శిశువులు ఉన్నట్లు గుర్తించి ఒక శిశువును తొలగించామన్నారు. ఇలాంటి క్లిష్టమైన, అరుదైన శస్త్రచికిత్సను హనుమకొండలో మొదటిసారి నిర్వహించినట్లు డాక్టర్ శిరీష వివరించారు.

కేయూ భూములను పరిరక్షించాలి



రిజిస్ట్రార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ భూములు ఆక్రమణకు గురికాకుండా చుట్టూ ప్రహరీ నిర్మించాలని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) హనుమకొండ, వరంగల్ జిల్లాల నాయకులు కోరారు. ఈమేరకు కాకతీయ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. యూనివర్సిటీ పరిధి చుట్టూ ప్రహరీ నిర్మాణ టెండర్ ప్రక్రియ ముగిసినా ఇంకా ఎందుకు పనులు మొదలు పెట్టలేదని రిజిస్ట్రార్‌ను ప్రశ్నించారు. కార్యక్రమంలో బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొలను సంతోష్‌రెడ్డి, వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు తీగల భరత్ గౌడ్, కందగట్ల సత్యనారాయణ, చల్లా జైపాల్‌రెడ్డి, కనుకుంట్ల రంజిత్, వన్నాల వెంకటరమణ, జన్ను మధు, మార్టిన్‌లూథర్, రఘునరెడ్డి, భరత్‌వీర్, అరణ్యరెడ్డి, శ్రీరాంరెడ్డి పాల్గొన్నారు.

మహిళలను గౌరవించాలి



మహిళలను సన్మానిస్తున్న సాగరిక, ధర్మారావు

కాజీపేట రూరల్: మహిళలను ప్రతిఒక్కరూ గౌరవించాలని కాంగ్రెస్ పార్టీ యూత్ నేషనల్ సెక్రటరీ, కర్ణాటక ఇన్‌చార్జ్ గొట్టిముక్కుల సాగరిక రమాకాంత్, బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు సూచించారు. కాజీపేట రైల్వే కమ్యూనిటీ హాల్‌లో రైల్వే ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ కాజీపేట ఎలక్ట్రిక్ షెడ్ బ్రాంచ్ సెక్రటరీ కుర్సపల్లి రవీందర్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన రవీందర్‌ను వారు అభినందించారు. పలువురు మహిళలను సన్మానించారు. రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సికింద్రాబాద్ డివిజన్ సెక్రటరీ జి.ప్రభురాజ్, ఈఎల్ఎస్ సెక్రటరీ కుర్సపల్లి రవీందర్, సంఘ్ ఏడీఎస్ కొత్త మురళీకృష్ణ, ఏఐజీడీఎస్‌యూ జాతీయ అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు, రైల్వే నాయకుడు కె.యాదవరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రైల్వే నాయకులు ఎం.సంజీవ, సీహెచ్.కిషన్, జె.రాంమూర్తి, జెగ్గారావు, బి.మాధవరావు, ఎం.దయాకర్, విజయ్‌కుమార్, రాజలింగం, రైల్వే మహిళా కార్మికులు, రెడ్ క్రాస్ డాక్టర్ తహెర్ మసూద్, టెక్నీషియన్లు, తదితరులు పాల్గొన్నారు.

ప్రీస్కూల్ ఎడ్యుకేషన్.. ఓ తీపి గుర్తు



హన్మకొండ: ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ జీవితంలో ఓ తీపి గుర్తుగా ఉంటుందని షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ కె.సుజాత అన్నారు. హనుమకొండ భవానీనగర్‌లోని సన్‌షైన్ ప్లే ప్రీస్కూల్‌లో యూకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుజాత ముఖ్యఅతిథిగా పాల్గొని కార్పొరేటర్ గుజ్జుల వసంతతో కలిసి విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ చిన్నారులపై ఒత్తిడి ప్రభావం పడకుండా ఆటపాటలతో చదువు నేర్పాలని సూచించారు. విద్యార్థుల పట్ల ప్రేమ, ఆప్యాయతలు పంచితే వారు భయపడకుండా స్కూల్‌కు వస్తారని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గుజ్జుల మహేందర్ రెడ్డి, సన్‌షైన్ స్కూల్ డైరెక్టర్ పి.నరేష్ గుప్తా, ఉపాధ్యాయులు సునీత, కుసుమ, శ్రీలేఖ, రమ్య, మాధవి, మమత, సంపూర్ణ, లిఖిత, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చదువుతోపాటు ఆటపాటల్లోనూ రాణించాలి



కాజీపేట: చిన్న వయస్సు నుంచే పిల్లలు చదువులతో పాటు ఆటపాటల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సాహం అందించాలని సెయింట్ గ్యాబ్రియల్ ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ బ్రదర్ పి.ఆంథోని అన్నారు. కాజీపేట 63వ డివిజన్ విద్యానగర్ కాలనీలోని సెయింట్ ఆన్స్ ఉన్నత పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలబాలికలు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సర్టిఫికెట్లను ఫాదర్ ప్రతాప్ ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ సిస్టర్ సుధారాణి, ప్రిన్సిపాల్ సిస్టర్ జూలుయా, ఆర్.నవీన్ రెడ్డి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక అక్రమాలు



మాట్లాడుతున్న వెంకటనారాయణ

కేయూ క్యాంపస్: బ్యూటీపార్లర్ నడిపి జీవనం గడిపిన చరిత్రగల ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత.. తన తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకొని రాష్ట్రంలో అనేక అవకతవకలు, అక్రమాలకు పాల్పడ్డారని తెలంగాణ ఉద్యమకారుల రాష్ట్ర కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ ఆరోపించారు. కాకతీయ యూనివర్సిటీలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఢిల్లీ లిక్కర్ కుంభకోణంలో కీలకపాత్ర పోషించి అడ్డంగా దొరికిపోయి, చట్టపరంగా కవిత అరెస్టును ప్రజలు సాధారణ విషయంగా పరిగణించాలని సూచించారు. సాధారణ పౌరులు ఏ చిన్న పొరపాటు చేసినా కేసీఆర్ పాలనలో చిత్రహింసలకు గురిచేసిన విషయాలు బీఆర్ఎస్‌వీ నాయకులు మరిచిపోయారని ఎద్దేవాచేశారు. రాక్షస పాలన కొనసాగించిన బీఆర్ఎస్ నేతలు.. కల్వకుంట్ల కవిత అరెస్టుకావటం జీర్ణించుకోలేక రోడ్లపైకి వచ్చి రాస్తారోకో చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇలాంటి వాటిని ప్రజలు ఖండించాలన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను భ్రష్టు పట్టించింది కవితేనని, సింగరేణి బొగ్గుగనుల వ్యవహారంలో, ఉద్యోగాల నియామకాల్లోనూ ఆమె అవకతవకలకు పాల్పడ్డారని విమర్శించారు. న్యాయ విచారణ జరిపిస్తే ఇంకా అనేక వాస్తవాలు వెలుగులోకి వస్తాయని అన్నారు. సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు వేదిక బాధ్యులు చింత కింది కుమారస్వామి, డాక్టర్ వీరస్వామి, డాక్టర్ నల్లాని శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అక్రమం



నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నేతలు

వరంగల్ చౌరస్తా: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ అక్రమమని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ విమర్శించారు. వరంగల్ చౌరస్తాలో స్థానిక కార్పొరేటర్ గందె కల్పన ఆధ్వర్యంలో నల్ల జెండాలతో శనివారం నిరసన తెలుపుతూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల ముందు కుట్రలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్రానికి ప్రధాని నరేంద్ర మోదీ వస్తూ.. తన జేబు సంస్థ అయిన ఈడీని కూడా తీసుకొచ్చారని ఆరోపించారు. కవితను అరెస్ట్ చేయొద్దని కోర్టు చెప్పినా కక్షపూరితంగా, కేసీఆర్‌ను రాజకీయంగా బద్నాం చేసేందుకు కేంద్రం ఈ దుశ్చర్యకు పాల్పడిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ హామీలు అమలయ్యే వరకు పోరాడుతూ ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్, కార్పొరేటర్లు మరుపల్ల రవి, సిద్ధం రాజు, బోగి సువర్ణ, బీఆర్ఎస్ నాయకులు రమేష్ బాబు, కుందారపు రాజేందర్, మావురపు విజయ్ భాస్కర్‌రెడ్డి, వొగిలిశెట్టి అనిల్, అజమ్, పొగాకు సందీప్, పూజారి విజయ్, అనిల్, ఇక్బాల్, యాకయ్య, యాకుబ్ తదితరులు పాల్గొన్నారు. నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి, అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

గుడిసెవాసులకు నివేశన స్థలాలివ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న గుడిసెవాసులు

దేశాయిపేట: నగరంలోని 13వ డివిజన్ ఎంహెచ్‌నగర్ -2లోని గుడిసెవాసులకు స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని సీపీఎం కాశిబుగ్గ ఏరియా కార్యదర్శి మహ్మద్ బషీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. పార్టీ కాశిబుగ్గ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నంబర్ 300లో సుమారు 1,600 పేద కుటుంబాలు గుడిసెలు వేసుకొని జీవిస్తున్నాయని అన్నారు. గత ప్రభుత్వం ఆ గుడిసెలను తొలగించిందని ఆందోళన వ్యక్తం చేశారు. దాంతో ఆ కుటుంబాలు అనేక ఇబ్బందులతో సతమతమవుతున్నట్లు తెలిపారు. అనంతరం తహసీల్దార్ మహమ్మద్ ఇక్బాల్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రమేష్, ప్రభాకర్, నరసింహులు, కుమార్, నజీర్, విజయ్, మధు, వెంకటేశ్వర్లు, స్రవంతి, హారిక, రమాదేవి, ఫర్జానా, దేవి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

కాజీపేట అర్బన్: వర్ధన్నపేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు అన్నారు. నియోజకవర్గ పరిధిలోని 44వ డివిజన్‌లోని కడిపికొండ రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీల్లో పలు అభివృద్ధి పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడిపికొండలోని రాజీవ్ గృహకల్ప, ఇందిరమ్మ కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో చేతిపంపు, మురుగునీటి కాల్వల నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు రాజారపు స్వామి సట్ల సదానందం, బ్లాక్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నర్మెట వెంకటరమణ గౌడ్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ గంగుల శ్రీనివాస్‌రెడ్డి, కట్కూరి రమేష్, వేణుగోపాల్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ



సదస్సు బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ, తదితరులు

కేయూ క్యాంపస్: కేయూ పరిధిలోని హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బాటనీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 22, 23వ తేదీల్లో జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఈమేరకు సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను కాకతీయ యూనివర్సిటీలో వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి, అధ్యాపకులు శనివారం వేర్వేరుగా ఆవిష్కరించారు. రీసెంట్ ట్రెండ్స్ ఇన్‌ప్లాంట్ సైన్స్ రీసెర్చ్ అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజిరెడ్డి కన్వీనర్ విజయపాల్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఓంకార్ తెలిపారు. కార్యక్రమంలో సదస్సు కోకన్వీనర్లు, బాటనీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ రాంబాబు, డాక్టర్ రమణారావు, డాక్టర్ గాంధీ తదితరులు పాల్గొన్నారు.